సాక్షి
మంచిర్యాల
బుధవారం ⁝ 4 ⁝ అక్టోబర్ ⁝ 2023



స్వేచ్ఛగా బతకనియ్యండి

కవ్వాల్ అభయారణ్యం వన్యప్రాణులకు రక్షణ కవచంలా మారింది. ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేయడంతో అటవీ జంతువుల వేట క్రమక్రమంగా తగ్గింది. 8లో▸



అభివృద్ధి పనులన్నీ పూర్తిచేస్తాం

మంచిర్యాల నియోజకవర్గంలో ప్రారంభించిన అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తామని ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఓపెన్ జిమ్ ప్రారంభించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
34.0 /22.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వాతావరణం చల్లబడుతుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు తుది ఓటరు జాబితా

మంచిర్యాలఅగ్రికల్చర్: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, నూతన ఓటరు నమోదు, సవరణల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం తుది జాబితాను బుధవారం కలెక్టర్ బీ సంతోష్ ప్రకటించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల అధికారి ప్రత్యేక సమావేశం, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ, తుది ఓటరు జాబితాపై అధికారులతో చర్చించారు. ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీకి చర్యలు చేపట్టారు. గత నెల 19వ తేదీ వరకు నూతన ఓటరు నమోదుకు 34వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. గత నెల 28న ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులు, అభ్యంతరాలు పరిష్కరించి ఈ నెల ఒకటో తేదీన జాబితా ప్రచురణకు ఎన్నికల సంఘం అనుమతి పొంది ఈ నెల 4వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురణకు పూర్తి స్థాయిలో సిద్ధం చేశారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) పిలుపుమేరకు జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా ఐదు శాతమే మధ్యంతర భృతి ప్రకటించడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. పెండింగ్ డీఏ, అన్నిరకాల పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్టీరింగ్ కమిటీ బాధ్యులు జయకృష్ణ, రేణుక, నాగలక్ష్మి, రజిత, మహేందర్ తదితరులున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట మంగళవారం 104 కాంట్రాక్ట్ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి ఎస్.శ్రీనివాస్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ధర్నా

ఆరు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సంక్షేమ వసతి గృహాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ కలెక్టరేట్ ఎదుట ప్రీమెట్రిక్ హాస్టల్స్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అనంతరం కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇచ్చారు.

ఈ-పంచాయతీ ఆపరేటర్ల వంటావార్పు



వంటావార్పులో ఆపరేటర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉద్యోగ భద్రత, పేస్కేల్ కోసం సమ్మెబాట పట్టిన డీపీఎంలు, ఈ-పంచాయతీ ఆపరేటర్లు రోజురోజుకూ ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ వద్ద వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ పనులను ఆన్‌లైన్‌లో అన్ని విధాలా నమోదు చేస్తూ పారదర్శక పాలనకు బాటలు వేస్తున్న డీపీఎంలు, ఈ-పంచాయతీ ఆపరేటర్ల విషయంలో ప్రభుత్వ వైఖరి సరికాదని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత లేక అవస్థలు పడుతున్న తమకు వెంటనే పేస్కేల్, జాబ్ గ్యారెంటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని రైతుబంధు సమితి రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్సీ పల్ల రాజేశ్వర్‌రెడ్డిని డీపీఎంలు, ఈ-పంచాయతీ ఆపరేటర్ల యూనియన్ సభ్యులు హైదరాబాద్‌లోని ఆయన క్యాంపు ఆఫీస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన పల్ల రాజేశ్వర్‌రెడ్డి వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియాకు సూచించినట్లు యూనియన్ సభ్యులు తెలిపారు.

అతివలకు ఆరోగ్య భాగ్యం

- ఆరోగ్య మహిళాకేంద్రాలతో సత్ఫలితాలు
- జిల్లాలోని తొమ్మిది ఆస్పత్రుల్లో సేవలు
- ప్రతీ మంగళవారం ఉచితంగా పరీక్షలు
- క్యాన్సర్ నిర్ధారణ అయినవారికి వైద్యం



జిల్లా కేంద్రంలోని హమాలీవాడ బస్తీ దవాఖానలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు (ఫైల్)

మంచిర్యాలటౌన్: గత మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రాలు సత్ఫలితాలనిస్తున్నాయి. జిల్లాలోని తాళ్లగురిజాల, కాసిపేట, తాండూర్, కుందారం, జన్నారం, నస్పూర్ పీహెచ్‌సీలు, మంచిర్యాలలోని హమాలీవాడ బస్తీ దవాఖాన, దీపక్‌నగర్, రాజీవ్‌నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లలో వీటిని ఏర్పాటు చేశారు. ప్రతీ మంగళవారం వైద్య సిబ్బంది మహిళలకు అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధులు నిర్ధారించి అవసరాన్ని బట్టి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. క్యాన్సర్ నిర్ధారణ అయినవారిని హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఆరోగ్య మహిళా కేంద్రాల్లో 7,716 మంది మహిళలు పేర్లు నమోదు చేసుకోగా 255 మందిని ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

క్యాన్సర్ బారిన మహిళలు

జిల్లావ్యాప్తంగా మొదట నాలుగు ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అనంతరం మరో ఐదింటిని గత నెలలో ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా తొమ్మిది పీహెచ్‌సీలు, బస్తీదవాఖాన, అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 7,716 మంది వైద్యం కోసం రాగా, వీరిలో క్రిటికల్ పరిస్థితిలో ఉన్న 255మందిని ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేశారు. 272 మందికి థైరాయిడ్ టెస్టులు చేయగా 79 మందికి నిర్ధారణ అయింది. 6,497 మందికి ఓరల్ క్యాన్సర్ టెస్టులు చేసి 29 మందికి లక్షణాలున్నట్లు గుర్తించారు. 10 మందిని సంబంధిత ఆస్పత్రికి రెఫర్ చేశారు. 6,480 మందికి రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి ఏడుగురిలో వ్యాధిని నిర్ధారించారు. మరో 39 మందిలో వ్యాధి లక్షణాలు గుర్తించారు. వీరిలో 35 మందిని సంబంధిత ఆస్పత్రికి రెఫర్ చేశారు. 1,733మందికి గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వీరిలో నలుగురిలో వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. 33 మందిలో లక్షణాలు గుర్తించి 15మందిని సంబంధిత ఆస్పత్రికి రెఫర్ చేశారు.

మహిళలకు వచ్చే వ్యాధులపైనే దృష్టి

ఆరోగ్య మహిళా కేంద్రాల్లో స్త్రీలకు ఎక్కువగా వచ్చే వ్యాధులపైనే వైద్యారోగ్యశాఖ దృష్టి సారిస్తోంది. ఈ కేంద్రాల్లో థైరాయిడ్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, మెనోపాజ్, కడుపులో నీటి బుడగలు, మూత్ర సంబంధిత వ్యాధులు, ఫంగస్ ఇన్‌ఫెక్షన్స్, మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తిస్తున్నారు. నెలసరి, సంతాన సమస్యలు, అవసరమైన వారికి అల్ట్రాసౌండ్, బరువు నియంత్రణ, శారీరక కలయిక సంబంధిత అంటువ్యాధుల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు.

ఇదీ.. జిల్లా సమాచారం	
ఆరోగ్య మహిళాకేంద్రాలు:	9
రిజిస్ట్రేషన్ చేసుకున్నవారు:	7,716
ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేసింది:	255
థైరాయిడ్ టెస్టులు చేసుకున్నవారు:	272
థైరాయిడ్ నిర్ధారణ అయినవారు:	79
ఓరల్ క్యాన్సర్ టెస్టులు చేసుకున్నవారు:	6,497
ఓరల్ క్యాన్సర్ అనుమానితులు:	29
రొమ్ము క్యాన్సర్ టెస్టులు చేసుకున్నవారు:	6,480
కొత్తగా రొమ్ముక్యాన్సర్ నిర్ధారణ అయినవారు:	7
గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ టెస్టులు:	1,733
గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ నమోదు:	4

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని ఆరోగ్య మహిళా కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే చాలామంది మహిళలు కేంద్రాల్లో వైద్యం చేయించుకున్నారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది. క్యాన్సర్ లాంటి వ్యాధులూ గుర్తిస్తున్నాం. చికిత్స అవసరాన్ని బట్టి హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నాం. వారికి చికిత్స అందేలా చర్యలు తీసుకుంటున్నాం. – సుబ్బరాయుడు, డీఎంహెచ్‌వో

వయోవృద్ధుల జీవితం ఆదర్శనీయం

- అదనపు కలెక్టర్ రాహుల్



వయోవృద్ధులతో రాహుల్, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: వయోవృద్ధుల జీవితం ఆదర్శనీయమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బీ రాహుల్ పేర్కొన్నారు. వారు జీవితంలో అనేక సమస్యలు ఎదుర్కొన్న అనుభవంతో అందరూ బాగుండాలనే ఉద్దేశంతో సన్మార్గాన్ని సూచిస్తారని తెలిపారు. మంగళవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నస్పూర్‌లోని సమీకృత కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం 14567 హెల్ప్‌లైన్ నంబర్ అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. నిర్వహణ చట్టం 2007 ప్రకారం నిరాదరణకు గురైన తల్లిదండ్రులు ఆర్డీవో ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసి సమస్య పరిష్కరించుకోవచ్చని సూచించారు. వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం వృద్ధాశ్రమాల నిర్మాణానికి కృషి చేస్తోందని చెప్పారు. వయోవృద్ధులు ఇంటినుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సులు, రైళ్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రయాణ ఖర్చుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని పేర్కొన్నారు. అనంతరం 80 ఏళ్లు పైబడిన వృద్ధులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు, బెల్లంపల్లి ఆర్డీవో సురేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య, సీడీపీవో ఉమాదేవి, విజయలక్ష్మి, హేమ సత్య, రేష్మ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడికి పీఎంశ్రీ

- ఎంపికైన పాఠశాలలకు కేంద్రం నిధులు
- అదనపు గది, సైన్స్‌ల్యాబ్ ఏర్పాటు
- భవనాల మరమ్మతుకు ఆమోదం



మంచిర్యాల మోడల్‌స్కూల్ భవనం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. పీఎంశ్రీ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద 2023–24 విద్యాసంవత్సరానికి నిధులు కేటాయించింది. అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, పాఠశాల భవనాల మరమ్మతు (మేజర్ రిపేర్)కు పాఠశాల విద్యాశాఖ ఇందుకు పరిపాలన అనుమతులిచ్చింది. తెలంగాణ రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులు చేపడుతోంది.

విడతల వారీగా నిధులు..

నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా జిల్లా నుంచి మొదటి విడతలో 19 పాఠశాలలు జాతీయ స్థాయిలో ఎంపికయ్యాయి. ఇందులో కొన్ని పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్‌ల్యాబ్, మేజర్ రిపేర్‌లకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో అదనపు తరగతి గది, సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి పథకం కింద కేంద్రం రూ.16లక్షలు మంజూరు చేసింది. పాఠశాల భవనాల మరమ్మతుకు రూ.4.50లక్షలు నిధులు కేటాయించింది. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని సూచించింది. పనులను పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్‌ఎంసీ) పర్యవేక్షిస్తోంది. అదనపు గదుల నిర్మాణంతో పాటు విద్యార్థులకు డ్యూయల్ డెస్క్, బెంచీలు సమకూర్చనున్నారు.

సైన్స్ ల్యాబ్‌కు నిధుల మంజూరు ఇలా..

జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎనిమిది పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయి. ఒక్కో పాఠశాలకు రూ.16లక్షలు నిధులు కేటాయించారు. టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ పర్యవేక్షణలో పనులు చేయాల్సి ఉంటుంది. ఎస్‌ఎంసీ ద్వారా ఫర్నిచర్, ల్యాబ్‌స్టూల్స్, టేబుల్, టీచర్ టేబుల్ తదితర పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బెల్లంపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ బాయ్స్, చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, దండేపల్లి జెడ్పీహెచ్‌ఎస్, దేవులవాడ జెడ్పీహెచ్‌ఎస్, మంచిర్యాల టీఎస్‌ఎంఎస్, మందమర్రి టీఎస్‌ఎంఎస్, రేచినీ జెడ్పీహెచ్‌ఎస్, నీల్వాయి జెడ్పీహెచ్‌ఎస్‌లకు సైన్స్‌ల్యాబ్‌కు సంబంధించిన నిధులు వచ్చాయి.

భవనాల మరమ్మతుకు నిధులు

ఆరు పాఠశాలల్లో భవనాల మరమ్మతులు (మేజర్ రిపేర్)కు రూ.4.50 లక్షల చొప్పున మంజూరు చేశారు. బెల్లంపల్లి టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ (బాయ్స్), టీఎస్‌ఆర్‌ఈఐఎస్ (బాయ్స్) తాళ్లగురిజాల రోడ్, బెల్లంపల్లి, టీఎస్‌ఎంఎస్ కాసిపేట్, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ (గర్ల్స్) లక్సెట్టిపేట, మంచిర్యాల టీఎస్‌ఎంఎస్, మందమర్రి టీఎస్‌ఎంఎస్ పాఠశాలల భవనాల మరమ్మతుకు ఆమోదం లభించింది.

ఒక్కో తరగతి గదికి రూ.16లక్షలు

జిల్లాలో నాలుగు పాఠశాలల్లో ఆరు అదనపు తరగతి గదులు నిర్మించనున్నారు. ఇందుకు ఒక్కో గదికి రూ.16లక్షలు కేటాయించారు. తాండూర్ జెడ్పీహెచ్‌ఎస్ రేచినీలో రూ.48 లక్షలతో మూడు గదులు నిర్మించనున్నారు. భీమారం జెడ్పీహెచ్‌ఎస్, నస్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ తీగలపహాడ్, నీల్వాయి జెడ్పీహెచ్‌ఎస్‌లకు రూ.16లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. గడువులోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని డీఈవో యాదయ్య తెలిపారు.

మున్సిపల్ సమస్యలపై ఆందోళన



ఖాళీ కుండలతో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలు పరిష్కరించడం లేదని, తమపై మున్సిపల్ చైర్మన్, ఎమ్మెల్యే వివక్ష చూపిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం కాంగ్రెస్ కౌన్సిలర్లు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఖాళీ కుండలు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ చిట్ల సత్యనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఉప్పలయ్య, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు మాజీద్, వేములపల్లి సంజీవ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు తూముల నరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి మాట్లాడారు. మున్సిపాలిటీలో దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదని తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాలనీల్లో సరైన రోడ్లు లేవని, డ్రెయినేజీలు లేక మురుగునీరు రోడ్లపై పారుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లకు సంబంధించి తొమ్మిది వార్డుల్లో డీఎంఎఫ్‌టీ నిధుల కేటాయింపులో వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. ప్రొటోకాల్‌కు విరుద్ధంగా నడుచుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ మారుతీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సిరిపురం రాజేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ బానేశ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వొడ్డె రాజమౌళి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సల్ల మహేశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణాధ్యక్షురాలు గజ్జెల హేమలత, పట్టణ ఉపాధ్యక్షుడు జోగుల సదానందం తదితరులున్నారు.

వివరాలు నమోదు చేయాలి

మంచిర్యాలఅర్బన్: ఎన్‌ఎంఎంఎస్ 2023–24కు సంబంధించి విద్యార్థుల (నూతన, రెన్యువల్) వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు పోర్టల్ ప్రారంభమైందని డీఈవో యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 2022లో ఎంపికై తొమ్మిదో తరగతి చదువుతున్నవారు, గతంలో ఎంపికై 10,11,12 తరగతులు చదువుతున్నవారు నవంబర్ 30లోపు రెన్యువల్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. సబ్మిట్ చేసిన అప్లికేషన్లు ఆయా విద్యాసంస్థల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్‌లు పాఠశాల లాగిన్‌ద్వారా వెరిఫికేషన్ చేసి డిసెంబర్ 15లోపు డీఈవో కార్యాలయంలో హార్డ్‌కాపీ అందజేయాలని సూచించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

తాండూర్: మండలంలోని కిష్టంపేట, మాదారం గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణాలకు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంగళవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. మాదారంలో రూ.20 లక్షలతో చేపట్టిన హెల్త్ సబ్‌సెంటర్, నీలాయపల్లెలో రూ.10లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మాదారం త్రీ ఇంక్లైన్ గ్రామంలో రూ.10లక్షలు, రేచినీ గ్రామంలో రూ.23 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ.2.60కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పూసాల ప్రణయ్, జెడ్పీటీసీ సభ్యుడు సాలిగామ బానయ్య, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పదోన్నతులపై ప్రతిష్టంభన..!

- ఎస్జీటీ బదిలీలకు షెడ్యూల్ ప్రకటన
- ఎటూ తేలని ఎస్‌ఏ పదోన్నతులు
- సీనియార్టీ ఎస్జీటీల్లో నిరుత్సాహం

మంచిర్యాలఅర్బన్: ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) పదోన్నతులపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఎస్‌ఏ పదోన్నతులపై ఎటూ తేల్చకుండానే ఎస్జీటీ బదిలీలకు షెడ్యూల్ ప్రకటించటంతో ఉపాధ్యాయుల్లో నిరుత్సాహం నెలకొంది. ప్రధానోపాధ్యాయుల బదిలీల నుంచి ఎస్‌ఏల పదోన్నతులు, బదిలీలు ప్రక్రియ అంతా సాఫీగా సాగింది. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా (ఎస్‌ఏ) పదోన్నతుల ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో టెట్ తెరపైకి రావటంతో పదోన్నతులు నిలిచిపోయాయి. పదోన్నతి పొందాలంటే తప్పనిసరి టీచర్ ఎలిజిబిలిటి టెస్ట్ (టెట్) ఉత్తీర్ణులై ఉండాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ క్రమంలోనే పదోన్నతుల ప్రక్రియ లేకుండానే ఎస్జీటీ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎస్జీటీ ఉపాధ్యాయుల ఎస్‌ఏల ప్రమోషన్లు ఎప్పుడు ఉంటాయో? ఎన్నికల షెడ్యూల్ వస్తే ఎలా..? అనే దానిపై ఉపాధ్యాయ వర్గాల్లో చర్చసాగుతోంది.

ఖాళీల భర్తీ ఎలా?

జిల్లాలో 232 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు ఏడేళ్ల నిరీక్షణ అనంతరం 51 మందికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి లభించింది. లోకల్‌బాడీ-45, ప్రభుత్వ పాఠశాల స్కూల్ అసిస్టెంట్లు ఆరుగురికి పదోన్నతులు లభించాయి. ఎస్జీటీలకు ఎస్‌ఏగా పదోన్నతులు కల్పించి భర్తీ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎస్జీటీల ప్రమోషన్లు చేపట్టకపోవటంతో ఉన్నత పాఠశాలల్లో ఖాళీల కారణంగా తరగతుల నిర్వహణపై ప్రభావం పడనుంది. దీంతో విద్యార్థులు నష్టపోయే అవకాశాలున్నాయి. కొత్త నియామకాలు చేపట్టడం, ఎస్జీటీలకు ఎస్‌ఏ ప్రమోషన్లు కల్పించేవరకూ సర్దుబాటు తప్పేలా లేదు.

ఎస్‌ఏల బదిలీల ఆర్డర్‌కాపీపై జాప్యం

స్కూల్ అసిస్టెంట్ బదిలీల ఆర్డర్‌కాపీపై ఎడతెగని జాప్యం నెలకొంది. ఈనెల 2వ తేదీన ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచి రిలీవై బదిలీ అయిన పాఠశాలలో 3వ తేదీన రిపోర్టు చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్‌లో సకాలంలో ఉపాధ్యాయుల బదిలీలు కాగా, సాంకేతిక లోపంతో మంచిర్యాల జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్లకు ఆర్డర్ కాపీ మంగళవారం రాత్రి వరకు అందలేదు. అన్నీ సవ్యంగా సాగితే 4న కొత్త పాఠశాలల్లో రిపోర్టు చేయనున్నారు. ఇదిలా ఉంటే ఆర్డర్‌కాపీ ఎప్పుడువచ్చినా పాత తేదీలో జాయిన్ కానున్నట్లు తెలిసింది.

పదోన్నతులు లేక నిరాశ

ఎస్జీటీలకు ఎస్‌ఏ పదోన్నతులు చేపట్టకపోవటంతో వారిలో నిరాశ నెలకొంది. పదోన్నతుల కంటే ముందు బదిలీలు చేపట్టడంతో అనుకున్న బదిలీ స్థానం కోల్పోయే అవకాశం ఉందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ప్రస్తుతం పదోన్నతులు లభించే ఎస్జీటీల బదిలీల్లో పట్టణ, రహదారి పక్కన పాఠశాలలు ఎంచుకుంటే పదోన్నతులు చేపట్టినప్పుడు అవి ఖాళీ అయ్యే వీలుంటుంది. ఇక్కడ ఆయన తర్వాత స్థానంలో ఉన్న ఉపాధ్యాయులు నష్టపోనుండడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల అనంతరం ఎస్జీటీ పోస్టులను కొత్తగా నియామకయ్యే ఉపాధ్యాయులతో భర్తీ చేయనుండటంతో ప్రస్తుత సీనియార్టీ ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అనాలోచిత నిర్ణయాలతో ఏళ్లతరబడి వేచి చూసిన తాము మారుమూల ప్రాంతాల పాఠశాలలకు వెళ్లాల్సి వస్తుందేమోననే భయం వారిని వెంటాడుతోంది.

పదోన్నతులు కల్పించాలి

తక్షణమే ప్రభుత్వం సరైన చర్యలు చేపట్టి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇవ్వాలి. ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్లు నిలిపివేయటం, సీనియర్ టీచర్లకు టెట్ రిలాక్సేషన్ ఉత్తర్వులు ఇవ్వకపోవటం సరికాదు. పదోన్నతులు కల్పించకుండానే బదిలీలు చేపట్టడం పాఠశాల విద్యాశాఖ అనాలోచిత నిర్ణయం. పాఠశాల విద్యావ్యవస్థ అస్తవ్యస్తం కానుంది.
– సత్తయ్య, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ ఆదేశాల మేరకే ..

జిల్లాలోని ప్రభుత్వ, లోకల్‌బాడీ ఎస్జీటీ, తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయులకు బదిలీ షెడ్యూల్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విడుదల చేశాం. ఈనెల 3, 4తేదీల్లో స్పౌజ్ పాయింట్లు తొలగించటం, జీవిత భాగస్వామి పాయింట్లు, డీఎస్సీ సంవత్సరానికి, ర్యాంకుల దిద్దుబాటుకు సంబంధించిన అప్పీలు, ఖాళీల సవరణలు, ఫిర్యాదులు, వివరాల అప్‌డేట్‌పై గ్రీవెన్స్ ద్వారా అప్పీల్ చేసుకోవాలి. ఈనెల 5న తుది సీనియార్టీ జాబితా ప్రదర్శించనున్నాం. ఈనెల 6, 7తేదీల్లో ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. 8న వెబ్ ఆప్షన్ల ఎడిట్ ఉంటుంది. వెబ్ ఆప్షన్ ఎంపిక ప్రారంభమైన తర్వాత ఖాళీలు, పాయింట్లు, జీవిత భాగస్వామి పాయింట్లపై మార్పులు, సవరణలు ఉండవు.
– యాదయ్య, జిల్లా విద్యాధికారి, మంచిర్యాల

క్లుప్తంగా

రెండు ఇసుక లారీల ఢీ

జైపూర్: మండల కేంద్రంలోని మంచిర్యాల–చెన్నూర్ 63వ జాతీయ రహదారిపై మంగళవారం రెండు ఇసుక లారీలు ఢీకొన్నాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నూర్ నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్ వెళ్తున్న లారీలుగా అతివేగంగా జైపూర్ బస్టాండ్ సమీపంలో ముందు వెళ్తున్న ఇసుక లారీని వెనుకాల వెళ్తున్న మరో ఇసుక లారీ బలంగా ఢీకొట్టింది. ఢీకొన్న లారీ క్యాబిన్ మొత్తం నుజ్జునుజ్జుగా మారింది. లారీ డ్రైవర్ దశరథ్‌కు గాయాలయ్యాయి.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. దొరగారి పల్లి సమీపంలో నేషనల్ హైవే రైల్వేట్రాక్ పక్కన నాలాలో సుమారు 40– 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు ఒంటిపై చిన్న టవల్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామని పేర్కొన్నారు. వివరాలకు నస్పూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


తిరుపతి(ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని బైక్‌పై వెళ్తున్న యువకుడు మృతిచెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. వాంకిడి మండలంలోని కిరిడి గ్రామానికి చెందిన వసకే తిరుపతి(18)సోదరిని ఆసిఫాబాద్‌లో బైక్‌పై తీసుకువచ్చి దించాడు. తిరిగి గ్రామానికి వెళ్తుండగా ఆసిఫాబాద్ జన్కాపూర్ వద్ద పోలీసుల వాహనాల తని ఖీలు చేపట్టారు. గమనించిన తిరుపతి వారిని తప్పించుకుని రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం సాలేగూడ వద్ద ఎదురుగా ఢీకొ ంది. ఈ ప్రమాదంలో తిరుపతి మృతిచెందాడు. బైక్ సైతం కాలిపోయింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

ఒకరికి ఐదేళ్ల జైలు

నెన్నెల: మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన బద్దం లక్ష్మారెడ్డిపై హత్యాయత్నం చేసిన అతడి అన్న బద్దం బాపురెడ్డికి మంచిర్యాల అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అర్పితమారం రెడ్డి ఐదు సంవత్సరాల జైలు శిక్ష , వెయ్యి రూపాయల జరిమానా విధించారు. నెన్నెల ఎస్సై శ్యాంపటేల్, లైజన్ ఆఫీసర్ గులాం దస్తగిర్ వివరాలు వెల్లడించారు. అన్నదమ్ములకు భూ పంపకాల్లో గొడవలు జరుగుతుండగా విరాసత్ కోసం 2018 జూన్ 13న తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన లక్ష్మారెడ్డిపై అక్కడే కళ్లల్లో కారం చల్లి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి ఎస్సై చందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశాడు. పేర్కొన్నారు. పోలీసులు కోర్టులో సాక్ష్యాదారాలను ప్రవేశపెట్టగా అదనపు పీపీ మదన్ మోహన్ బాధితుడి పక్షాన వాదించి నేరనిరూపన చేశారని తెలిపారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు తుది తీర్పు వెలువరించిందని చెప్పారు.

స్వేచ్ఛగా బతకనివ్వండి..

- వన్యప్రాణులకు రక్షణగా అనేక చట్టాలు
- అటవీ జంతువుల రక్షణ బాధ్యతగా తీసుకోవాలి
- ప్రారంభమైన వన్యప్రాణి వారోత్సవాలు

జన్నారం: భూమిపై ప్రకృతి అందాలకు కొదవ లేదు. అందమైన చెట్లు, వృక్షాలు, దట్టమైన అడవులు ప్రకృతి సౌందర్యాలకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ ప్రకృతి ఒడిలో అలరాడుతూ తిరిగే వన్యప్రాణులకు స్వేచ్ఛ కరువవుతోంది. కవ్వాల్ టైగర్‌జోన్ ఎన్నో రకాల వన్యప్రాణులకు పుట్టినిల్లు. ఈ అడవిలో చుక్కల దుప్పులు, నీలుగాయిలు, దుప్పులు, సాంబర్లు, కొండగొర్రెలు, జింకలు, కుందేళ్లు, ముళ్లపందులు, పందులు లాంటి వన్యప్రాణులతో పాటు పులులు, చిరుతలు, ఎలుగుబంట్లు లాంటి ఎన్నో మృగాలు కూడా ఈ అడవిలో జీవిస్తున్నాయి. కవ్వాల్ అభయారణ్యం 1965లో వన్యప్రాణుల విభాగంగా (వైల్డ్‌లైఫ్)గా ఏర్పాటు చేశారు. వీటి రక్షణ కోసం 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని ఏర్పాటు చేశారు. ప్రతీ సంవత్సరం అక్టోబర్ 2 నుంచి 8 వరకు నిర్వహించే వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక కథనం.

తగ్గిన వన్యప్రాణుల వేట..

ఎత్తైన టేకు వృక్షాలతో దట్టమైన అడవిగా ఉన్న కవ్వాల్ అభయారణ్యం 2,015 స్క్వేర్ కిలోమీటర్ల వైశాల్యంతో ఉంది. వన్యప్రాణ చట్టం ప్రవేశపెట్టిన అనంతరం కవ్వాల్ అభయారణ్యం వన్యప్రాణులకు రక్షణ కవచంగా మారింది. అప్పటి నుంచి వన్యప్రాణులను వేటాడిన, హాని కలిగించిన చట్టాల ప్రకారం శిక్షలుండేవి. ఆ శిక్షలు పూర్తి స్థాయిలో అమలయ్యేవికావు. చట్టాలపై అవగాహన లేక కొందరు న్యప్రాణులను వేటాడి చంపి వాటి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకునేవారు. కాని ఇక్కడి దట్టమైన అడవులను, వన్యప్రాణులకు కావాల్సిన ఆహారాన్ని పరిశీలించిన టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, కేంద్ర ప్రభుత్వం 12 ఏప్రిల్ 2012లో ఈ అభయారణ్యాన్ని టైగర్‌జోన్‌గా ప్రకటించింది. ఇందుకు 893 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియా, 1123 చదరపు కిలోమీటర్ల బఫర్ ఏరియాను కేటాయించారు. ఒకప్పుడు వన్యప్రాణుల వేటకు చిరునామాగా మారిన ఈ ప్రాంతం టైగర్‌జోన్ ఏర్పాటుతో వేట తగ్గింది. ఈ టైగర్‌జోన్ ఏర్పాటు నుంచి వన్యప్రాణులకు రక్షణ కవచంగా మారింది. కఠినమైన చట్టాలను అమలు చేయడంతో మెల్లమెల్లగా వన్యప్రాణుల వేట తగ్గుముఖం పట్టింది.

అవగాహన కోసం వారోత్సవాలు

వన్యప్రాణుల రక్షణ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 2 నుంచి 8 వరకు వన్యప్రాణుల వారోత్సవాలను నిర్వహిస్తారు. ఈ వారోత్సవాల్లో ప్రతీ రోజు ఒక కార్యక్రమం చేస్తూ అటవీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తారు. వేటాడిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ శిక్షలు పడేలా చేయడంతో వేటా ప్రస్తుతం తగ్గుముఖం పట్టింది.

షెడ్యూల్ ఇలా...

ఈ వారోత్సవాలు షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నారు. మొదటి రోజు అక్టోబర్ 2న అవగాహన ర్యాలీ, అక్టోబర్ 3న డివిజన్‌లోని రేంజ్‌ల పరిధిలో ఫుట్ పెట్రోలింగ్, 4న విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు, 5న జన్నారం రేంజ్ పరిధిలోని బైసన్‌కుంట వద్ద విద్యార్థులకు అవగాహన సదస్సు, 6న బైసన్ కుంట వద్ద బర్డ్ వాక్ కార్యక్రమం, 7న సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీలకు అవగాహన, 8 న అటవీశాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు, విద్యార్థులచే బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.


వన్యప్రాణులు

ప్రత్యేక సౌకార్యాలు..

జన్నారం అటవి డివిజన్ వన్యప్రాణుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. డివిజన్‌లోని 40 బీట్‌లలో గడ్డి క్షేత్రాలను విరివిగా ఏర్పాటు చేశారు. నీటి కుంటలు, అవాసానికి అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మూడేళ్లుగా అడవుల్లోకి పశువులు వెళ్లకుండా కట్టడి చేశారు. అలజడి లేక వన్య ప్రాణులు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంది.


వన్యప్రాణుల కోసం పెంచుతున్న గడ్డి

కఠినమైన చట్టాలు

వన్యప్రాణులను వేటాడిన, వాహనంతో ఢీకొట్టి చంపిన కఠినమైన చట్టాలున్నాయి. 1972 ఆక్ట్ ప్రకారం 6 నెలల నుంచి 8 ఏళ్ల వరకు జైలు శిక్షతో పాటుగా రూ.3వేల నుంచి రూ.10వేల వరకు జరిమానా ఉంది. షెడ్యూల్ 1 కిందికి వచ్చే పులి, చిరుత, ఎలుగుబంటి లాంటి అంతరిస్తున్న జంతువులను వేటాడిన వారికి ఎనిమిదేళ్ల జైలు శిక్ష ఉంటుంది. షెడ్యూల్ 2 కిందికి వచ్చే మిగతా జంతువుల వేటాడిన చంపిన 6 నెలల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

వన్యప్రాణులకు అన్ని రకాల సౌకర్యం



వన్యప్రాణుల సంరక్షణకు పెద్దపీట వేశాం. జన్నారం డివిజన్ పరిధిలో వన్యప్రాణులకు పలు రకాల గడ్డి క్షేత్రాలను పెంచుతున్నాం. వన్యప్రాణులకు నీరు, ఆహారం, అవాసం ఒకేచోట ఉండేలా చూస్తున్నాం. రాత్రి, పగలు, బేస్‌క్యాంపు, అటవీ సిబ్బందితో పెట్రోలింగ్ చేపిస్తున్నాం. గతంతో పోలిస్తే వన్యప్రాణుల సంఖ్య పెరిగింది. వన్యప్రాణులను వేటాడిన, హాని కలిగించినా కఠినమైన శిక్షలు పడే చట్టాలున్నాయి. వన్యప్రాణ చట్టాలపై అవగాహన కల్పించేందుకు వారోత్సవాలను నిర్వహిస్తున్నాం.

– మాధవరావు, ఎఫ్‌డీవో

108లో ప్రసవం..


బిడ్డను చూపిస్తున్న సిబ్బంది

దండేపల్లి: మండలంలోని కాసిపేటకు చెందిన పుష్పలత నిండు గర్భిణి. మంగళవారం తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యంలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో పైలెట్ సత్తయ్య అంబులెన్స్‌ను పక్కకు నిలుపగా, ఈఎంటీ నర్సయ్య ఆమెకు డెలివరీ చేయగా మగ బిడ్డను ప్రసవించింది. వెంటనే ఆ ఇద్దరిని జగిత్యాల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

15న ఉమ్మడి జిల్లా ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సెయింట్‌మేరీ హైస్కూల్‌లో ఈ నెల 15న ఉదయం 9గంటలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓపెన్ టు ఆల్ చదరంగ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట సుధాకర్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కె.శివప్రసాద్ ఆదేశాల మేరకు అర్జున్ చెస్ అకాడమీ వారి సౌజన్యంతో చెస్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే వారు ఉదయం 9గంటల్లోగా సెయింట్ మేరీ హైస్కూల్లో రిపోర్టు చేయాలని, ఆసక్తి గల వారు వివరాలకు చీఫ్ ఆర్బిట్రేటర్ రామయ్యను సెల్ నం. 89780 26306 సంప్రదించాలన్నారు. ఈ నెల 14లోగా వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

డీపీఈ గైడ్‌లైన్స్‌ను రద్దు చేయకుంటే సమ్మె

మందమర్రిరూరల్: కోలిండియాలో డీపీఈ గైడ్‌లైన్స్‌ను రద్దు చేయాలని, లేకుంటే ఈ నెల 12,13,14 తేదీల్లో ఐదు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మె తప్పదని సీఐటీయూ మందమర్రి బ్రాంచ్ అధ్యక్షుడు వెంకటస్వామి హెచ్చరించారు. మంగళవారం ఏరియాలోని కేకే 5 గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు గనుల రంగం ఈ గైడ్‌లైన్స్‌తో ఇబ్బందులు పడే అవకాశం ఉందని, దానిని దృష్టిలో ఉంచుకొని గతంలో చైర్మన్‌కు వినవించగా సవరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గైడ్‌లైన్స్‌ను రద్దు చేసేంత వరకూ ఐదు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పోరటాలు తప్పవని పేర్కొన్నారు. సమావేశ అనంతరం గని మేనేజర్ భూశంకరయ్యకు వినతి పత్రం అందించారు. ఫిట్ కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో వడ్ల కొండ శివ, చైతన్య రెడ్డి, కల్వల శ్రీనివాస్, దొంద నవీన్, ఆదర్శ్, తిరుపతి నాయక్ ఉన్నారు.


గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వంట ‘మాస్టర్లు’గా..

నెన్నెల: ప్రభుత్వం ఇస్తున్న బిల్లులు చాలడం లేదని, వంట బిల్లులు రావడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో ఉండడంతో పలు పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం సరిగా అందడం లేదు. దీంతో ఉపాధ్యాయులే వంట వార్పు నిర్వహిస్తున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠాలు బోధించే గురువులే మంగళవారం రెండు గంటల పాటు భోజనం తయారు చేసి 150మంది విద్యార్థులకు వడ్డించారు. ప్రధానోపాధ్యాయుడు దండనాయకుల ప్రకాష్‌రావు తన సొంత డబ్బులతో కూరగాయలు, సన్న బియ్యం తెచ్చి విద్యార్థుల ఆకలి తీర్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాత్కాలిక వంట నిర్వాహకులను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


మధ్యాహ్న భోజనం వండుతున్న టీచర్లు

సింగరేణిని విముక్తి చేయాలి

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య

శ్రీరాంపూర్: సింగరేణిని రాజకీయ నాయకుల, ప్రజాప్రతినిధుల చేతుల నుంచి విముక్తి చేయాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఆయన శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.29వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 11వ వేతన ఒప్పందంలో ఉద్యోగుల వేతనాల పెరుగుదలపై అధికారులు కోర్టులో వేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 12, 13, 14 తేదీల్లో దేశ వ్యాప్తంగా బొగ్గు గనుల్లో జాతీయ సంఘాలు సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఆ యూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, నాయకులు రాచర్ల చంద్రమోహన్, మోహన్ రెడ్డి, నరసింహారావు, అఫ్రోజ్ ఖాన్, శంకర్, సత్తయ్య సుధాకర్ ఉన్నారు.


మాట్లాడుతున్న వీ సీతారామయ్య

రెండు రోజుల్లోనే చోరీ కేసు ఛేదించిన పోలీసులు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- చోరీకి గురైన సొత్తు రికవరీ

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేషనల్ హైవే పక్కన ఉన్న అర్జయ్య ఇంట్లో దొంగతనం జరిగి బంగారం, వెండి అపహరణకు గురి కాగా రెండు రోజుల్లోనే పోలీసులు దొంగలను పట్టుకొని చోరీకి గురైన సొత్తును రికవరీ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహేందర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన ఏదుల దీపక్, గాంధీనగర్‌కు చెందిన మేకల అశోక్, అంకుశంకు చెందిన ముద్దం సాయికిరణ్ ముగ్గురు జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత నెల 30న హైవే పక్కన ఉన్న ఇంట్లో దొంగతనం చేసి బంగారం, వెండి నగలు అపహరించారు. గతంలో హాజీపూర్, సోమగూడం, నస్పూర్‌లలోని దేవాలయాల్లో దొంగతనాలు చేసి అరెస్ట్ అయి శిక్ష అనుభవించారు. తర్వాత రెండు సంవత్సరాల క్రితం బెల్లంపల్లిలోని కన్నాల వద్ద దీపక్ బోర్‌వెల్స్ అనే షాపు పెట్టి గ్రామాలలో బోరు వేస్తుండగా అశోక్, కిరణ్‌లు వచ్చి బోరు కోసం దీపక్‌ను కలవడంతో ముగ్గురికి పరిచయం ఏర్పడింది. జల్సాలకు అలవాటుపడి, తక్కువ సమయంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ముగ్గురు కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. సోమగూడంలో ఏడున్నర తులాల బంగారం, పది తులాల వెండి వస్తువులు దొంగలించగా ఐదున్నర తులాల బంగారం, మిగతా రెండు తులాలకు సంబంధించి నగదు రికవరీ చేయడంతో పాటు వెండిని పూర్తిస్థాయిలో రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ విషయమై ఈ నెల 1వ తేదీన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాసిపేట ఎస్సై గంగారాం, పోలీసులు ఉన్నారు.


మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

గుండెపోటుతో కాగజ్‌నగర్ ఆర్డీవో మృతి

ఆసిఫాబాద్/ఉట్నూర్‌రూరల్: కుమురంభీం జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కాగజ్‌నగర్ ఆర్డీవో జాడి రాజేశ్వర్ మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల పనిచేసిన రాజేశ్వర్ హఠాన్మరణం పొందడంతో ఆయనతో పనిచేసిన ఉద్యోగులు దిగ్భ్రాంతి చెందారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం లక్కారం గ్రామానికి చెందిన ఆయన ప్రస్తుతం కాగజ్‌నగర్ ఆర్డీవోగా విధులు నిర్వర్తిస్తున్నారు. వారానికి ఓసారి స్వగ్రామానికి వస్తుంటారు. కుటుంబంతో గడిపేందుకు సోమవారం సాయంత్రం సొంతూరికి వచ్చారు. తిరిగి విధులకు వెళ్లేందుకు మంగళవారం ఉదయం సిద్ధమయ్యారు. స్నానం చేసేందుకు బాత్‌రూంకు వెళ్లిన ఆయన చాలాసేపటి వరకు బయటికి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు బాత్‌రూం తలుపులు పగులగొట్టారు. అచేతనంగా కిందపడి ఉన్న రాజేశ్వర్‌ను హుటాహుటిన కారులో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అంచెలంచెలుగా ఎదిగి..

జాడి రాజేశ్వర్ తన ఉద్యోగ ప్రస్థానాన్ని టైపిస్ట్‌గా ప్రారంభించారు. ఆ తర్వాత జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, తహసీల్దార్, ఆర్డీవోగా అంచెలంచెలుగా ఎదిగారు. ఉట్నూర్, ఆదిలాబాద్ ఆర్డీవోగా పనిచేసిన అనంతరం 2022 నవంబర్ 10న కాగజ్‌నగర్ ఆర్డీవోగా బదిలీ అయ్యారు. ఆసిఫాబాద్ ఇన్‌చార్జి ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్‌వోగానూ ఆయన సేవలందించారు.

ప్రముఖుల సంతాపం

ఆర్డీవో రాజేశ్వర్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఉమ్మడి జిల్లాలోని ప్రముఖులు ఆయన స్వగ్రామానికి చేరుకున్నారు. కుమురంభీం జిల్లా కలెక్టర్ హేమంత్ బొర్కడే, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, అధికారులు, వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున చేరుకుని మృతదేహం వద్ద నివాళులర్పించారు. అలాగే కుమురంభీం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ ఉద్యోగులు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ డీఏవో రఫత్, తహసీల్దార్ సాయన్న, డీటీ పోచయ్య, రాంలాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పీవో చాహత్ బాజ్‌పాయ్


జాడి రాజేశ్వర్ (ఫైల్)

నేడు ఆర్కే న్యూటెక్ గనికి ప్రజాభిప్రాయ సేకరణ

- ప్రగతి మైదానంలో ఏర్పాట్లు
- పునర్ ధ్రువీకరణకు అనుమతులు కోరుతూ కార్యక్రమం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే న్యూటెక్ భూగర్భ గనికి సంబంధించిన పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమం నేడు (బుధవారం) జరుగనుంది. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో కలెక్టర్ సమక్షంలో కాలుష్య నియంత్రణ మండలి(నిజామాబాద్) అధికారులు ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టనున్నారు. దీని కోసం ఏరియా అధికారులు ఇక్కడ అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. అయితే ఈ గని పాత గనే అయినప్పటికీ 2006లో కేంద్ర అటవి, పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇచ్చిన కొత్త ఉత్తర్వులకు లోబడి ఈ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టుతున్నారు. 1983లోనే ఈ భూగర్భ గని ఏర్పడింది. నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ ప్రాంతంలో 327.4 హెక్టార్ల అటవి భూమి కింద ఈ గని విస్తరించి ఉంది.

మరో ఐదేళ్ల జీవిత కాలం..

గనికి మరో ఐదేళ్ల జీవిత కాలం ఉంది. గని ప్రారంభంలో తీసుకున్న అనుమతులతో ఇన్నాళ్లు గనిని నడిపారు. అయితే 2006లో కేంద్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం వీటిని పునర్ ధ్రువీకరణ చేసుకోవాల్సి ఉంది. ఇంకా 1.32 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు తీసుకోవడం కోసం ఈ పర్యావరణ అనుమతి నేడు తప్పనిసరైంది.


సీఈఆర్ క్లబ్ వద్ద చేసిన ఏర్పాట్లు

- గని పేరు: ఆర్కే న్యూటెక్
- స్వరూపం: భూగర్భ గని
- గని విస్తీర్ణం: 327.4 హెక్టార్లు
- గని ఆవిర్భాం: 1983
- గుర్తించిన నిల్వలు : 28.83 మిలిమియన్ టన్నులు
- వెలికితీయడానికి అనుకూలం: 17.32 మిలియన్ టన్నులు
- ఇప్పటికి తీసిన నిల్వలు: 12.19 మిలియన్ టన్నులు
- మిగిలిన నిల్వలు: 1.32 మిలియన్ టన్నులు
- సాలీనా ఉత్పత్తి: 0.33 మిలియన్‌టన్నులు
- మిలిగి ఉన్న జీవిత కాలం: 5 సంవత్సరాలు

క్షణికావేశంతో ఆత్మహత్యలు

- ఆత్మహత్యలకు స్పాట్‌గా గోదావరి వంతెన
- ఒకేరోజు ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఆనవాళ్లు

జైపూర్: గోదావరి వంతెనపైన ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. క్షణికావేశంతో గోదావరి నదిలో దూకి ఆత్మహత్యలు చేసుకుంటూ ఇటూ కన్నవారికి అటూ కట్టుకున్నవారికి తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. ఒక్క రోజునే ఇద్దరు జిల్లా వాసులు గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీరాంపూర్ ఆర్కే–8ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకినట్లుగా బ్రిడ్జిపైన ఆనవాళ్లు లభించాయి. ఇటీవల వరుసగా గోదావరి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఆందోళన రేకెత్తిస్తుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో అన్నారం, పార్వతి బ్యారేజీల మధ్యన గోదావరి నదిలో పుష్కలంగా నీరు ఉంటుంది. మరో వైపు గోదావరి బ్రిడ్జినే స్పాట్‌గా ఎంచుకుంటున్న వారు క్షణికావేశంలో దూకి ఆత్మహత్యలకు పాల్పడటం అందరిని ఆందోళనకు గురిచేస్తోంది. పెద్దపల్లి–మంచిర్యాల జిల్లా సరిహద్దు ప్రాంత గోదావరి బ్రిడ్జిపై నుంచి శ్రీరాంపూర్ ఆర్కే–8 కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మంగళవారం దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రీరాంపూర్ ఆర్కే–8కాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి ఎస్‌కే–పాషా ఓ ప్రైవేట్ చిట్‌ఫండ్స్‌లో ఒక్కరి షూరిటీగా ఉండగా అతడు డబ్బులు చెల్లింక పోవడంతో ఎస్‌కే పాషాను వేధించడం మొదలు పెట్టారు. దీంతో చీట్‌ఫండ్స్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లుగా లేఖ రాసి ఉంచాడు. ఆయన బ్యాగు, చెప్పులు ఆయన రాసిన లేఖను పోలీసులు గుర్తించారు. ఇదే శ్రీరాంపూర్ ఆర్కే–8ప్రాంతానికి చెందిన చందనవేని మోహన్ యాదవ్ అనే మరో యువకుడు స్నేహితులు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా ఫోన్ చేయగా దాన్ని జీర్ణించుకోలేని మోహన్ గోదావరి వంతెనపై బైక్ పెట్టి కనిపించకుండాపోయాడని, అతడి ఫోన్ ట్రాక్ సైతం కనిపించకపోవడం ఆత్మహత్యకు పాలప్డి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


గోదావరి బ్రిడ్జిపై ఎస్‌కే.పాషా బ్యాగు, చెప్పులు

కార్మికుడు ఆత్మహత్య

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్కే కాలనీకి చెందిన గీగులా అఖిల్(30) సింగరేణి కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగుచూసింది. ఎస్సై రాజేశ్ వివరాల తెలిపారు. అఖిల్ తండ్రి అనారోగ్యంతో చనిపోవడంతో ఆయన స్థానంలో అఖిల్‌కు సింగరేణి ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం ఎస్సార్పీ 3 గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాడు. అఖిల్ తన తల్లితో కలిసి ఆదివారం వారి స్వగ్రామమైన ఖాజీపేటకు వెళ్లాడు. సోమవారం ఒక్కడే తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతరులతో స్నేహం చేయవద్దన్నందుకే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని సోదరుడు అభివన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భర్తకు ఏడాది జైలు

బెల్లంపల్లి: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన భర్తకు మంగళవారం బెల్లంపల్లి న్యాయస్థానం ఏడాది జైలుశిక్ష, జరిమానా విధించింది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో బన్సీలాల్ వివరాల ప్రకారం.. యుగేందర్ తన భార్య మణీంద్రను అదనపు కట్నం తీసుకురావాలని వేధించడంతో 2015లో వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఏఎస్సై రమేష్ కేసు నమోదు చేయగా ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఆరుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో బెల్లంపల్లి జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎన్.ముకేష్ పైవిధంగా తీర్పు చెప్పారు.